## అలరించిన కుస్తీ పోటీలు



కుస్తీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ అవినాశ్ కుమార్

భైంసాటౌన్, ఏప్రిల్ 7: మండలంలోని కామోల్ గ్రామంలో సోమవారం శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఏఎస్పీ అవినాశ్ కుమార్ సీతారాములను దర్శించుకుని కుస్తీ పోటీలు నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. మహారాష్ట్ర, తెలంగాణలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన మల్లయోధులు కుస్తీ పోటీల్లో తలపడ్డారు. రూరల్ సీఐ నైలు, ఎస్ఐ శంకర్ పోటీలు సజావుగా జరిగేలా చూశారు.

## వ్యభిచార గృహంపై దాడి

ఎదులాపురం, ఏప్రిల్ 7 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్కే కాలనీలో వ్యభిచార గృహంపై మావల పోలీసులు సోమవారం దాడి చేశారు. భాగ్యలక్ష్మి, గంగన్న అనే ఇద్దరు అమాయక మహిళలు, యువతులకు డబ్బు ఆశ చూపుతూ పడుపు వృత్తి చేయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్కడ గుర్తించిన ఇద్దరు బాధిత మహిళలను సఖీ కేంద్రానికి తరలించారు. నిందితులైన భాగ్యలక్ష్మి, గంగన్నతోపాటు విటులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## సమగ్ర సర్వే నిధులు విడుదల చేయండి



వినతిపత్రం ఇస్తున్న నాయకుడు

ఉట్నూర్, ఏప్రిల్ 7 : సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఎన్యూమరేటర్, సూపర్‌వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు తక్షణమే నిధులు విడుదల చేయాలని టీజీటీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ జాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వేచేసి ఆరు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నేటికీ విధుల డబ్బులు జమ చేయకపోవడం శోచనీయమన్నారు. వెంటనే నిదులు విడుదల చేయాలన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, ఏప్రిల్ 7 : గిరిజనుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. సోమవారం పీవో క్యాంప్ కార్యాలయంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ మండలం చందూరి గ్రామానికి చెందిన పోసుబాయి తనకి అంగన్‌వాడీ సెంటర్‌లో ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని, ఆసిఫాబాద్ జిల్లా తాండూర్ మండలం గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన గట్ల నర్సయ్య తనకి మేకల లోన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, నేరేడిగొండ మండలం కుంటాల గ్రామానికి చెందిన సిడాం లక్ష్మీ తనకు ఏదైనా ఆశ్రమ పాఠశాలలో ఆశ కార్యకర్త ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ దర్బార్‌లో ఏపీవో పీటీజీ మెస్రం మనోహర్, ఏవో దామోదర స్వామి, అదనపు వైద్యాధికారి మనోహర్, ఈఈ తానాజీ, పీహెచ్‌వో సందీప్ కుమార్, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

## న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీలో చోరీలు

ఎదులాపురం, ఏప్రిల్ 7 : ఆదిలాబాద్ పట్టణం మావల పీఎస్ పరిధిలోని న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం రాత్రి నాలుగిళ్లలో చోరీ జరిగింది. తాళాలు వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. మంచిర్యాల జిల్లాలో ఎంపీడీవోగా పని చేస్తున్న మధుసూదన్ ఇంట్లో రూ.8వేల నగదు, మూడు వాచీలు, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ తానాజీ ఇంట్లో తులం బంగారు, 60 తులాల వెండి నగలు, రూ.38 వేల నగదు, కేంద్ర విష్ణు ఇంట్లో రూ.50 వేల నగదు, ఐదు గ్రాముల బంగారు నగలను ఎత్తుకెళ్లినట్లు మావల ఎస్ఐ వీ విష్ణువర్ధన్ తెలిపారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## మాతృ మరణాలు నివారించాలి

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 7 : మాతృ మరణాలు నివారించాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, ప్రసవానంతరం సరైన సమయంలో సేవలందిస్తే మాతృ మరణాలు, నవజాత శిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో టీవీవీపీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహా సభలను విజయవంతం చేయండి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 7 : ఈనెల 11,12,13 తేదీల్లో ఆసిఫాబాద్ జిల్లా కెరిమెరిలోని జోడేఘాట్‌లో నిర్వహించే తుడుం దెబ్బ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేశ్ అన్నారు. ఈసందర్భంగా సోమవారం నిర్మల్ పట్టణంలో రాష్ట్ర మహా సభలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై మహా సభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో గోవర్ధన్, మనోజ్, వరుణ్, గణపతి, ప్రకాశ్, గోవింద్‌రావు, తదితరులున్నారు.

## త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

ఇచ్చోడ, ఏప్రిల్ 7 : మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం ఆదిలాబాద్ ఎంపీ గొడాం నగేశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మండలంలోని చిమన్‌గూడి, సూర్యపేట్, భీంపూర్, చింతగూడ, కుంటగూడ, పాలవాగు, రాంనగర్ గ్రామాల్లో వ్యవసాయ మోటర్లు పనిచేయడం లేదని, త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు దేవురావు, పెందుర్ దేవ్‌రావ్ పాటిల్, రాథోడ్ గోపన్న పాల్గొన్నారు.

## తుడుందెబ్బ రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల

ఇచ్చోడ, ఏప్రిల్ 7 : ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర మహా సభలను ఈనెల 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కో కన్వీనర్ గొడం గణేశ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని కుమ్రం భీం యుద్ధ భూమి జోడేఘాట్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సభలకు రాష్ట్రంలోని తుడుందెబ్బ, అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలన్నారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ తుడుందెబ్బ, డివిజన్ అధ్యక్షుడు ఆత్రం మహేందర్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలాం వరుణ్, మండల కన్వీనర్ సిడాం మురళి, డివిజన్ అధ్యక్షుడు ఆత్రం గణపతి, సిడాం గంగారాం పటేల్, చహకటి మన్కు, తొడసం రాము, పూలేడు బీముడు, తొడసం ప్రకాశ్, సిడాం మహదు, గోవింద్‌రావ్ ఉన్నారు.

## బాధితునికి నష్టపరిహారం అందజేత

తలమడుగు, ఏప్రిల్ 7 : మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన మెస్రం లచ్చు ఇటీవల ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షా బాధితునికి ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.5 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్ రాజమోహన్ పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

భీంపూర్, ఏప్రిల్ 7: బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి కార్యకర్తల కీలక సమావేశం ప్రారంభమవుతుందని భీంపూర్ మండల బీఆర్ఎస్ కన్వీనర్ మేకల నాగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, ఏప్రిల్7: నేషనల్ అకాడమీ ఆఫ్ కాన్స్ట్రక్షన్ (న్యాక్) ద్వారా అందించే సర్టిఫికెట్ కోర్సుల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఏడీ నాగేంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తి నైపుణ్యం అనుభవం కలిగిన వారికి నామమాత్ర ఫీజుతో సర్టిఫికెట్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఒకరోజు శిక్షణకు రూ.1200, ఎలక్ట్రీషియన్, నైపుణ్యం కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9866565156 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ సర్టిఫికెట్ దుబాయ్ వెళ్లేవాళ్లకు చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సర్టిఫికెట్‌తో ప్రభుత్వ రుణాలు పొందవచ్చని తెలిపారు.

## దొంగ పట్టివేత

ముథోల్, ఏప్రిల్ 7 : మండల కేంద్రమైన ముథోల్‌లోని కాల్వ గల్లీలో ఆదివారం అర్ధరాత్రి దొంగతనానికి యత్నించిన బాసరకు చెందిన లక్ష్మణ్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ సంజీవ్ తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాత్రి హనుమాన్ ఆలయంలో చోరీకి యత్నించగా అక్కడేమి లేకపోవడంతో ద్విచక్రవాహనం దొంగలిస్తుండగా యువకులు పోలీసులకు సమాచారం అందించారు. వెంబడే పోలీసులు చేరుకొని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

ఇంద్రవెల్లి, ఏప్రిల్7 :రైతు భరోసాకు చెందిన నిధులను ఎలాంటి ఆంక్షలు లేకుం డా విడుదల చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు వద్ద సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్ర భుత్వం రైతులందరికీ రైతు భరోసా నిధులు అందించి పంట రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సుదర్శణ్, సుమిత్రబాయి, సోనూబాయి, విజ్జుబాయి, తెలంగారావ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు సన్మానం

ఎదులాపురం, ఏప్రిల్ 7: జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కోలాకిరణ్ కుమార్‌ను ఏబీవీపీ ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) కళాశాలలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఆదిలాబాద్ పట్టణాధ్యక్షుడు డాక్టర్ రవికుమార్, జిల్లా కన్వీనర్ ఖడ్సే అక్షయ్, జిల్లా కో కన్వీనర్ నిఖిల్, నాయకులు కార్తీక్, మహేశ్, అజయ్ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

ఇచ్చోడ, ఏప్రిల్ 7 : మండలంలోని సిరిచెల్మలో విద్యుత్ షాక్‌కు గురై ఒకరు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఎల్లమ్మగూడకు చెందిన హుస్సేన్ (32) సిరిచెల్మ లోని విద్యుత్ స్తంభం వద్ద వైర్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. భార్య అలిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

## యాత్రను విజయవంతం చేయాలి

ఎదులాపురం, ఏప్రిల్ 7 : తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, అగ్రవర్ణ పేదల రాజ్య స్థాపనకై డాక్టర్ విశారదన్ మహరాజ్ చేపట్టే లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలల శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మా భూమి కరపత్రాలు ఆవిష్కరించారు. ఇక్కడ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తు, నాయకులున్నారు.

## ఒకేషనల్ కళాశాల విద్యార్థులకు క్లినికల్ ట్రైనింగ్ అనుమతి

భైంసా,ఏప్రిల్, 7 : పట్టణంలోని గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫిమేల్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషన్ ద్వారా సంవత్సర కాల పరిమితితో కూడిన క్లినికల్ శిక్షణ ఆర్డర్ కాపీని జారీ చేయడం జరిగిందని భైంసా ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్ సోమవారం తెలిపారు. విద్యార్థులు మెరుగైన వైద్య శిక్షణను పూర్తి చేసుకొని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఇందులో ప్రిన్సిపల్ సాయినాథ్, తదితరులున్నారు.

# వాంకిడిని అభివృద్ధి చేసి చూపిస్తా

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



వాంకిడిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, ఏప్రిల్ 7 : వాంకిడి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. వాంకిడి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక కాగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమెమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు రానివారు కొందరు ఉన్నట్లు తెలిసిందని వారు ఎలాంటి దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ముందుగా గ్రామ వీధుల్లో పర్యటించానని, ఇప్పటికే కొన్ని సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ప్రతి వీధిలో సీసీరోడ్డు నిర్మించి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలు వా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానక్‌సింగ్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు రాజు, శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు గులాబ్‌సింగ్, నజీర్, భారత్,సుజల్, సంతోష్, నవీన్, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాధులపై అవగాహన లేక రోగాలపాలు

ఎదులాపురం, ఏప్రిల్7: వ్యాధులపై సరైన అవగాహన లేక వివిధ రోగాలకు గురవుతున్నారని డీఎల్ఎస్ఏ కార్యదర్శి భోనగిరి సౌజన్య అన్నారు. సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా వైద్యారోగ్య శాఖ సంయుక్తంగా మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు పారిశుద్ధ్య కార్మికులకు అందిస్తున్న చికిత్సలను పరిశీలించి మందులను పంపిణీ చేశారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ, వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని, ఆరు నెలలకు ఒకసారి పూర్తిగా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్, వైద్యులు సమీయొద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నరేందర్, శంకర్, మెడికల్ ఆఫీసర్లు వినోద్‌కుమార్, ఐప్పుత్ పీహెచ్‌సీ కెమా రాజారెడ్డి, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి మొక్కలు పెంచుతున్న ఒకరిపై కేసు

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని కుమ్మరితాండ పంచాయతీ పరిధిలోని రాముగూడ గ్రామంలో గంజాయి మొక్కలు పెంతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, తమకు అందిన సమాచారం మేరకు రాముగుడా గ్రామానికి చెందని కుంర సోనేరావు తన పెరటిని పరిశీలించగా అక్కడ సుమారు 3 నుంచి 7 ఫీట్ల ఎత్తుగల 20 గంజాయి మొక్కలున్నాయని తెలిపారు. వాటిని స్వాదీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

## ఉచిత అంబలిని సద్వినియోగం చేసుకోండి



ఉచిత అంబలి పంపిణీ చేస్తున్న పాకాల రాంచందర్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 7 : జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలు, పాదచారులకు కోసం పా కాల ముత్తన్న జ్ఞాపకార్థం నిర్మల్ పట్టణంలోని విశ్రాంతి భవనం ఎదుట ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని సోమవారం పాకాల రాంచందర్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొన్ని సంవత్సరాలుగా పాకాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత అంబలి పంపిణీని చేపట్టామని గుర్తు చేశారు. జూన్ రెండో తేదీ వరకు అంబలి, చలి వేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ దర్మాజీ రాజేందర్, రమణా రెడ్డి, ఆమెడ శ్రీధర్, కొట్టె శేఖర్, సాయన్న, ఎంసీ లింగన్న, ప్రభాఇకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో జిల్లా కళాకారుల ప్రదర్శన



కళాప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

ఉట్నూర్ రూరల్/ఇచ్చోడ, ఏప్రిల్ 7: ఢిల్లీలో జరిగిన మినిస్టరీ ఆర్ట్ కల్చర్, సంగీత్ నాటక అకాడమీ చేపట్టిన జయతి జయ మమ భారతం అనే వీడియో డ్యాకుమెంటరీ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కాంత్లే శ్రీధర్ మాట్లాడుతూ, ఢిల్లీ రాజధానిలో సంగీత్ నాటక అకాడమీ వారు చేపట్టిన డ్యాకుమెంటరీలో తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్ జిల్లా నలుగురు ఆదివాసీ కళాకారులతోపాటు దేశం నలుమూల నుంచి వచ్చిన 100 కళాకారులు పాల్గొన్నారన్నారు. అలాగే గణతంత్ర వేడుకల్లో 5 వేల మంది కళాకారులతో డ్యాకుమెంటరీ కార్యక్రమం చిత్రీకరించి గిన్నిస్ రికార్డు చేయడం జరిగిందని తెలిపారు. అందులో మన జిల్లా కళాకారులు పాల్గొని ప్రదర్శన ఇవ్వడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాత్లే ఆనంద్, గంగోత్రి, రీతు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

ఎదులాపురం, ఏప్రిల్ 7 : అతివేగం, అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడిపి బాలుడి మృతికి కారణమైన కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.2500 జరిమానాను విధిస్తూ స్పెషల్ జేఎఫ్ సీఎం (పీసీఆర్) న్యాయమూర్తి టీ దుర్గారాణి కాళిదండి తీర్పు వెలువరించినట్లు కోర్టు లైజన్ అధికారి సీహెచ్ విజయ్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ధోబికాలనీకి చెందిన నేరెళ్ల వినోద్, కుమారుడు నేరెళ్ల అఖిల్ టీఎస్ 01ఈకే 4149 నంబర్ గల ద్విచక్ర వాహనంపై 1 మే 2019 రోజున ఆదిలాబాద్ నుంచి తాంసికి వెళ్తున్నారు. మార్గమధ్యంలోని హస్నాపూర్ శివారులో సుంకిడి వైపు నుంచి ఎదురుగా వస్తున్న టీఎస్ 01ఈఎల్ 7133 నంబర్ గల ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో వెనకాల కూర్చున్న నేరెళ్ల అఖిల్‌కు తలపై తీవ్రగాయాలయ్యాయి. వెంటనే రిమ్స్ దవాఖానకు చికిత్స తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో నేరెళ్ల పద్మ (తల్లి) తాంసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ రాధిక కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతివేగంగా అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడిపి బాలుడి మృతికి కారకుడైన సెక్షన్లు 304(ఏ) 338 ఐపీసీ181 ఎంవీ చట్టం కింద ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టలవాడకు చెందిన జాదవ్ అరవింద్(35)కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ తీర్పు విలువరించారన్నారు.

## అడవి పందులను పట్టుకున్న అటవీ అధికారులు



నిందితులతో అటవీ శాఖ అధికారులు

భైంసా, ఏప్రిల్, 7 : మహారాష్ట్ర నుంచి అక్రమంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక వాహనంలో అడవి పందులను తరలిస్తుండగా కాపు కాసి పట్టుకున్నట్లు భైంసా అటవీ శాఖ రేంజ్ అధికారి వేణుగోపాల్ తెలిపారు. వాహనంలో 13 పందులు ఉన్నట్లు వెల్లడించారు. మహారాష్ట్రలోని హింగోలి జిల్లాకు చెందిన సంజయ్ జాదవ్, అనిల్ జాదవ్, పర్బని జిల్లాకు చెందిన కృష్ణ అక్రమంగా అడవి పందులను తరలిస్తున్నట్లు తెలిపారు. తమ సిబ్బంది పట్టుకొని అటవీ శాఖ రేంజ్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వాహనాన్ని సైతం స్వాధీనం చేసుకున్నామన్నారు.

## నాణ్యతలేని సన్న బియ్యం ఇస్తున్నారు

- ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



దిలావర్‌పూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

దిలావర్‌పూర్, ఏప్రిల్ 7 : పేదలకు ఇచ్చే సన్న బియ్యం నాణ్యతలేనివి ఇస్తున్నారని తన దృష్టికి వచ్చిందని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన దిలావర్‌పూర్ గ్రామంలో రేషన్ దుఖానంలో సన్నబియ్యం పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేదలకిచ్చే రేషన్ బియ్యం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.40 ఇస్తే రాష్ట్రం రూ.2 కలిపి ఈ బియ్యం ఇస్తుందన్నారు. పేదలకిచ్చే సన్నబియ్యంలో నాణ్యతలేనివి ఇస్తున్నారనే ఆరోపణలు వచ్చాయని, నాణ్యమైన బియ్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎజాజ్ అమ్మద్‌ఖాన్, ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్, తాజా మాజీ సర్పంచ్ విరేశ్‌కుమార్, నాయకులు ముత్యంరెడ్డి, చందు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కత్తితో బెదిరించిన ఒకరి అరెస్ట్

ఎదులాపురం, ఏప్రిల్ 7 : కత్తిని చూపిస్తూ చంపేస్తానంటూ బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పట్టణంలోని చించేరివాడకు చెందిన తోట విగ్నేష్ కత్తిని చూపిస్తూ చంపేస్తానంటూ బెదిరించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినందుకు కేసు నమోదు చేశామన్నారు.

## కత్తుల ప్రదర్శనపై ముగ్గురిపై కేసు

బోథ్, ఏప్రిల్ 7: బోథ్ మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో బహిరంగంగా కత్తుల ప్రదర్శన చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. ఎస్ తెలిపిన వివరాల ప్రకారం, మండల కేంద్రంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం విశ్వ హిందూ పరిషత్ బజరంగ్ దళ్‌తోపాటు పట్టణానికి చెందిన కొంతమంది యువకులు ర్యాలీ నిర్వహించారన్నారు. ఈ ర్యాలీలో పాల్గొన్న కార్తీక్ సిందేకర్, రాహుల్ సిందేకర్, బోయిడి ఆకాశ్ కత్తుల ప్రదర్శన చేశారని తెలిపారు. నిబంధన విరుద్ధంగా ర్యాలీలో మరణ ఆయుధాలు ప్రదర్శించిన వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఇచ్చోడ, ఏప్రిల్ 7 : హాస్టల్‌లోని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. హాస్టల్ రూంలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట కేజీబీవీ ప్రిన్సిపల్ మల్లిక ఉన్నారు.

## నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

సోన్, ఏప్రిల్ 7: వచ్చే వానకాలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయశాఖ మండలాధికారి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం రైతు వేదికలో విత్తన డీలర్లతో నిర్వహించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ విత్తనాలను ప్రోత్సహించవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## బాలికపై గ్యాంగ్ రేప్

ఎదులాపురం, ఏప్రిల్ 7 : మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక కాలనీకి చెందిన పన్నెండేళ్ల బాలికపై నలుగురు గ్యాంగ్ రేప్ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. అదే కాలనీలో నివాసం ఉంటున్న 35 ఏళ్ల వివాహిత మాయ మాటలతో మభ్య పెట్టి బాలికను సమీపంలోని అడవిలోకి తీసుకెళ్లి ఇద్దరు యువకులతో లైంగికదాడి చేయించింది. ఆ తర్వాత ఆ యువకులలో ఒకరు మరో ఇద్దరికి ఫోన్ చేయగా, వారు కూడా వచ్చి లైంగికదాడి చేశారు. రాత్రి ఇంటికి వచ్చిన బాలిక తల్లికి విషయం చెప్పడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు ప్రాథమిక విచారణ పూర్తి చేసి నిందితులను గుర్తించారు. అనంతరం బాలికను రిమ్స్ దవాఖానకు తరలించి ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఈ కేసులో బాలికను మభ్యపెట్టి లైంగికదాడి చేయించిన మహిళతోపాటు యువకులపై ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్ట్, లైంగికదాడి, పోక్సో కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి తెలిపారు.

## ముగిసిన కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్,7: జిల్లా వ్యాప్తంగా మార్చి 17 నుంచి చేపట్టిన కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే సోమవారం ముగిసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ పేర్కొన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపులో భాగంగా జిల్లాలో ఈ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో వైద్య సిబ్బంది సర్వే నిర్వహించారు. 1,82,343 గృహాలను సందర్శించి 7,93,731 మంది ఆరోగ్య లక్షణాలు పరీక్షించారు. 513 మంది అనుమానితులను గుర్తించారు. సర్వేలో ఇద్దరు డిప్యూటీ పీఎంవోలు, 115 మంది సూపర్‌వైజర్లు, 559 మంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 12న పాలిటెక్నిక్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎదులాపురం, ఏప్రిల్ 7 : పట్టణంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో చరిత్రలో మొదటిసారిగా 1980 నుంచి అన్ని బ్యాచ్‌లకు సంబంధించి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఈనెల 12న నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షులు అభయ్ రాజ్, కార్యదర్శిగా ఉమ శంకర్ తెలిపారు. ఈ నేపథ్యంలో సమ్మేళనానికి సంబంధించి సన్నాహక సమావేశాన్ని సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ బండి రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈనెల 12న జరిగే కార్యక్రమంపై చర్చించారు.

## సీసీఐ ఫ్యాక్టరీ ప్రారంభం కోసం ఉద్యమ కార్యాచరణ

ఎదులాపురం, ఏప్రిల్ 7: సీసీఐ ఫ్యాక్టరీని పునఃప్రారంభించడంలో ప్రజల భాస్వామ్యం కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందించామని సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేశ్ తెలిపారు. సోమవారం సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8 నుంచి 10 వరకు గ్రామగ్రామాన కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. 9న ఎంపీ, ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నేతృత్వంలో సీఎంను కలిసి సమస్యను విన్నవిస్తామన్నారు. సీసీఐతోపాటు ఎయిర్‌పోర్ట్ పనులు, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్, టెక్స్‌టైల్ పార్కు సాధన కోసం ఉద్యమిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తామని తెలిపారు. కేంద్రం నుంచి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులను సాధించేలా ఒత్తిడి తెస్తామన్నారు. సమావేశంలో కో కన్వీనర్ నారాయణ, బండి దత్తాత్రి, రమేశ్, లోకారి పోశెట్టి,విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన సేవలకు కృషి

ఎదులాపురం, ఏప్రిల్ 7: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని డీఈ శివనాగేశ్వర్ అన్నారు. సోమవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో కస్టమర్ సర్వీస్‌లో భాగంగా సేవా శిబిరం నిర్వహించారు. వినియోగదారులు వారి సమస్యలను అధికారులకు విన్నవించారు. కొన్నింటిని అక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఏజీఎం రంజిత్, ఎస్ఈఈలు, జేటీవోలు పాల్గొన్నారు.

## ‘నాసిరకంగా మురుగు కాలువ నిర్మాణ పనులు’

గుడిహత్నూర్, ఏప్రిల్ 7: గుడిహత్నూర్ మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నాసిరకం ఇసుక వాడుతున్నారని సీతాగొంది గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరోపించారు. సీతాగొంది గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.8 లక్షల మురుగు కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. సంబంధిత కాంట్రాక్టరు నాసిరకం ఇసుక, తక్కువ మోతాదులో సిమెంటు వాడుతున్నారని గ్రామ వీడీసీ అధ్యక్షుడు మహేశ్‌పాటిల్, సభ్యులు సంతోష్‌గౌడ్, మల్లే, బేర దేవన్న, సుభాష్, రాందాస్, శ్యాంరావ్, నర్సింగ్ తెలిపారు. ఈ విషయం డీఈ, జేఈఈ, ఎంపీడీవోల దృష్టికి తీసుకెళ్లి బిల్లు ఆపాలని వినతిపత్రం అందజేశామని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షణ చేసి నాసిరకం పనులు నిలిపి వేయాలని కోరారు.

## మోడీ ప్రభుత్వం ధరలు పెంచడం అమానుషం

ఎదులాపురం, ఏప్రిల్ 7 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల పైన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్‌పై అధిక ధరలు పెంచడం అమానుషమని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ఇబ్బంది పడుతున్న క్రమంలో సోమవారం కేంద్రం పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారిందన్నారు. అనాలోచితంగా పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## అడవి పంది దాడిలో పాలేరుకు గాయాలు

ఇచ్చోడ, ఏప్రిల్ 7 : పంట పొలంలో పాలేరుపై అడవి పంది దాడి చేయగా, గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి, అడేగామ(కే) గ్రామానికి చెందిన బద్దం రమేశ్ రెడ్డి రైతు వద్ద జైనూర్ మండలానికి చెందిన గణపతి మూడు నెలలుగా పాలేరుగా పనిచేస్తున్నాడు. సోమవారం చెరువు సమీపంలో జొన్న పంట పొలం వద్ద ఉన్న ఎడ్లను తీసుకు రా వడానికి వెళ్లాడు. జొన్న పంట పొలంలో ఉన్న అడవి పంది అతనిపైకి దూకి దాడి చేసింది. కడుపుపై తీవ్రగాయాలయ్యాయి. సదరు పాలేరు కేకలు వేయడంతో పక్క పొలంలో ఉన్న పలువురు రైతులు ఒక్కసారిగా కర్రలు పట్టుకుని రావడంతో అడవి పంది పారిపోయింది. క్షతగాత్రున్ని వెంటనే 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

## కోర్టు నోటీసు ధిక్కరించిన మహిళకు జైలు

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 7: కోర్టు నోటీసు ధిక్కరించిన కేసులో ఖానాపూర్ మండలం ఎక్బాల్‌పూర్ గ్రామానికి చెందిన గుగ్లావత్ వందనకు ఖానాపూర్ కోర్టు పది రోజుల జైలు శిక్ష విధించినట్లు నిర్మల్ ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం, మహిళ గుగ్లావత్ వందన గతంలో నాటుసారా విక్రయిస్తూ పట్టుపడగా ఆమెపై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ వేసి హాజరు కావాలని నోటీసులు పంపగా హాజరు కాలేదన్నారు. దీంతో ఖానాపూర్ మేజిస్ట్రేట్ గుగ్లావత్ వందనకు అరెస్టు వారెంట్ జారీ చేయగా అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచామన్నారు. దీంతో మేజిస్ట్రేట్ 10 రోజుల జైలు శిక్ష విధించగా ఆదిలాబాద్ జైలుకు తరలించాని తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న ముగ్గురిపై కేసు

ఉట్నూర్, ఏప్రిల్ 7 : గంజాయి తరలిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం సాయంత్రం ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఉట్నూర్ ఇన్‌చార్జి ఎస్ఐ సునీల్ పేర్కొన్నారు. పట్టణంలోని ఐటీడీఏ సమీపంలో పక్కా సమాచారం మేరకు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కరీంనగర్‌కు వెళ్తున్న ఆటోలో ముగ్గురు యువకు లు కిలోన్నర గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బేల మండలంలోని పాటగూడ, పర్సుగూడకు చెందిన మారుతి వద్ద కొనుగోలు చేసి వస్తున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి గంజాయి, ఆటోను, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

## జామ్ గురుకులంలో పర్యావరణంపై అవగాహన

సారంగాపూర్, ఏప్రిల్ 7 : మండలంలోని జామ్ బాలికల గురుకుల విద్యాలయంలో సోమవారం ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మహ్మద్ నజీర్‌ఖాన్ పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్యం వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరిపై బాధ్యత ఉందన్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్ సంగీత, ఎఫ్‌బీవోలు భూమేశ్, స్రవంతి, స్వప్న, వెన్నెల, సుజాత తదితరులు పాల్గొన్నారు.